క్లుప్తంగా

నేడు, రేపు కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: ప్రతికూల వాతావరణం, భారీ వర్షాల కారణంగా విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం(18514/18513) నైట్ ఎక్స్‌ప్రెస్ శని, ఆదివారాల్లో) దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో వయా విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో కిరండూల్ నుంచి బయల్దేరవలసిన కిరండూల్-విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరి వయా కోరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా విశాఖ చేరుకుంటుంది.

దుర్గమాంబకు పూజలు


అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం దుర్గమాంబ ఆలయంలో శ్రీరామా సేవా సమాజం(యాదవ్) ఆధ్వర్యంలో శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు జరిపారు. గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్రైం పీఎస్‌పై గోనె సంచుల ఏర్పాటు


క్రైం స్టేషన్‌పై పోలీసులు ఏర్పాటు చేసిన గోనె సంచులు

సీతమ్మధార: స్థానిక ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ లోపలికి వర్షపు నీరు రావడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో క్రైం పీఎస్‌లోకి నీరు చేరి కేసులకు సంబంధించిన పలు పత్రాలు తడిచిపోయాయి. ఎస్‌ఐతో పాటు సిబ్బంది వాన నీరు కారకుండా స్టేషన్‌పై కప్పుపై తాత్కాలికంగా గోనె సంచులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ స్టేషన్ రేకుల షెడ్ కావడంతో ఒకవైపు నీరు లోపలికి రావడంతో కింద ఉన్న ప్లైవుడ్ తడిచిపోయేది. సిబ్బంది గ్లాసులతో వర్షపు నీరు పట్టుకుని బయట పారవేసే పరిస్థితి నెలకొంది. అధికారులు ఈ సమస్యను పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

మురళీనగర్: మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌జీజీవోస్ కాలనీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో అపోలో ఆస్పత్రి సహకారంతో ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బీపీ, సుగర్, కంటి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. డాక్టర్ ధీరజ్ వైరల్ జ్వరాల నివారణపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. మురళీనగర్, మాధవధార జంట కాలనీల వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కొండవాలు సమస్యలపై వినతి


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ గంకల కవిత శుక్రవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందించారు. వార్డులో పర్యటించి సమస్యలను గుర్తించి, పెండింగ్ పనులు సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.


పట్టపగలు వెలుగుతున్న వీధిలైట్లు


ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


ఏఎస్సార్ నగర్ టిడ్కో గృహ సముదాయం

సమస్యలతో సతమతం

- ఏఎస్సార్ నగర్ టిడ్కో గృహ సముదాయంలో సౌకర్యాల కొరత
- ఆస్పత్రి, ఓపెన్ జిమ్ అవసరం
- వీధిలైట్లు లేక ఇబ్బందులు
- పట్టించుకోవాలని నివాసుల విజ్ఞప్తి


కాలనీలో నిర్మించిన వాటర్ ట్యాంక్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయంలో నివసిస్తున్న ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 280 టిడ్కో ఇళ్లు నిర్మించి గత ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేసింది. ఇక్కడ వసతుల గురించి ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో రాత్రిళ్లు వీధిలైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ఉదయం వేళల్లో కూడా లైట్లు వెలుగుతున్నాయి. ఇవి కూడా రాత్రయితే వెలగడం లేదు. కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు లైట్లు అమర్చలేదు. ఈ ప్రాంతంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

నీటికి ఇక్కట్లు

ఈ ప్రాంత వాసుల కోసం ఇక్కడ జీవీఎంసీ 40 కిలో లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్ నిర్మించింది. ప్రస్తుతం అది సరిపోవడం లేదు. ఇక్కడ కనీసం 80 కిలో లీటర్ల కెపాసిటీ వాటర్ ట్యాంక్ అయినా నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇంటింటికీ నీటి కుళాయిలను ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రస్తుతం ఉన్న నీరు గృహ లబ్ధిదారులకు సరిపోవడం లేదు.

ట్రాన్స్‌ఫార్మర్‌తో భయం భయం

టిడ్కో గృహ సముదాయానికి విద్యుత్ సరఫరా కోసం ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వాటి వద్ద ఎటువంటి భద్రత చర్యలు లేనందున ఇవి ప్రమాదకరంగా మారాయి. ఈ కాలనీలో చిన్న పిల్లలు చాలా మంది ఉన్నారు. వీరంతా ఈ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటే చేసిన ప్రాంతాల్లో ఆడుకుంటూ, తిరుగుతూ ఉంటారు. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని నివాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో ప్రజలకు చేరువగా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసినట్లే.. తమ కాలనీలో కూడా అందుబాటులోకి తీసుకురావాలని, సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

మా ప్రాంతంలో చిన్న ఆస్పత్రి నిర్మిస్తే బాగుంటుంది. ఏ రోగమొచ్చినా ప్రైవేట్ హాస్పిటళ్లకు, లేదా సుమారు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోని రైల్వే న్యూకాలనీకి నడచి వెళ్లాల్సి వస్తోంది. ఖాళీ ప్రాంతంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి. తాగునీరు సరిపోవడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.సతీష్, ఏఎస్సార్ నగర్

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ కల్పించాలి

మా కాలనీ పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దానికి ఏ విధమైన రక్షణ చర్యలు చేపట్టలేదు. పిల్లలు పొరపాటున ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్తే ప్రమాదాలకు గురవుతారు. చాలా భయంగా ఉంది. రాత్రి వేళల్లో వీధి లైట్లు వెలగడం లేదు.

– నాగయ్య, ఏఎస్సార్ నగర్

హరితాంధ్ర దిశగా అడుగులేద్దాం

ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు


రైల్వేన్యూకాలనీ జీవీఎంసీ స్కూల్ వద్ద మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

తాటిచెట్లపాలెం: హరితాంధ్ర కోసం అడుగులేద్దాం, పచ్చని మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందాం అని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు సూచించారు. జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వన మహోత్సవం (వనం-మనం) కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5, జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఏపీడీ పద్మావతి, టీడీపీ నాయకులు వెంకటరమణ, ఆకిరెడ్డి జగదీష్, జనసేన నార్త్ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రామాంజనేయులు తదితరులు

సీతంపేట: కొత్త సంస్కృతిని, జీవన విధానాన్ని అలవర్చుకుని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్.కరుణరాజు అన్నారు. భెల్ మాజీ డిప్యూటీ మేనేజర్ తెన్నేటి పద్మావతి సంస్మరణ సభ శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా 'ప్రాకారాలు దాటిన ఆకాశం తాకిన తెన్నేటి పద్మావతి' అనే పుస్తకాన్ని మాజీ ఐఏఎస్ అధికారి, ఎమ్మెల్యే పి.రామాంజనేయులు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా కరుణరాజు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులు మారాయని, ఆత్మవిశ్వాసంతో కష్టపడి పనిచేసే మనస్తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ పద్మావతి ఎంతో ఆత్మగౌరవంతో జీవించారని, సామాజిక సేవలో పాల్గొనడమే కాక, మద్యానికి బానిసై జీవితాలను పాడుచేసుకుంటున్న కార్మికుల్లో మార్పునకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ తెన్నేటి జయరాజు, ఎమ్మెల్యే బోనెల విజయచందర్, మాజీ వీసీ ఆచార్య వీరయ్య, విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, ఆచార్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో కుక్కల బెడద


రైతుబజార్‌లో తిష్ట వేసిన కుక్క

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌లో కుక్కల బెడదతో వినియోగదారులు హడలి పోతున్నారు. ఈ బజారు నిత్యం వినియోగదారులు, రైతులు, సిబ్బందితో రద్దీగా ఉంటుంది. ఇక్కడ కొన్ని కుక్కలు తిష్ట వేయడంతో వినియోగదారులు, రైతులు ఇబ్బందది పడుతున్నారు. ఒక కుక్క తరచూ దాడులకు పాల్పడుతుండటంతో వినియోగదారులు రైతుబజారుకు రావడం మానేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కుక్క ఇప్పటివరకు ఏడుగురిని కరవడంతో వారు చికిత్స కోసం ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. రైతుబజార్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వ్యక్తి కుమారుడు కూడా కుక్క బాధితుల్లో ఒకడు కావడం విశేషం. జీవీఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు స్పందించి కుక్కల బెడద నివారించాలని వినియోగదారులు, రైతుబజార్ సిబ్బంది కోరుతున్నారు.

ఉర్రూతలూగించిన మైకేల్ జాక్సన్ పాటలు

ధ్వని అనుకరణతో ఆకట్టుకున్న డీటీఎస్ రమేష్


మైకేల్ జాక్సన్ పాటకు నోటితో సంగీతం అందిస్తున్న డీటీఎస్ రమేష్

మద్దిలపాలెం: ప్రసిద్ధ పాప్ కింగ్ మైకేల్ జాక్సన్ జయంతి వేడుకలను శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిమిక్రీ కళాకారుడు రమేష్‌కుమార్(డీటీఎస్ రమేష్) తన గాత్రంతో నోటి ద్వారా మైకేల్ జాక్సన్ పాటలకు సంగీతాన్ని సమకూర్చిన ప్రదర్శనతో ఆహూతులను ఆకట్టుకున్నారు. ఎంజే సూపర్ హిట్ సాంగ్స్‌కు నోటితో సంగీతాన్ని ఇస్తూ ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. సుమారు 15 పాటలకు రమేష్ ధ్వని అనుకరణతో మ్యూజిక్ హోరెత్తించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఖాన్‌లు ప్రసంగిస్తూ మైకేల్ జాక్సన్ పాటలకు నోటి ద్వారా సంగీతం సమకూర్చడం అద్భుత ప్రక్రియ అన్నారు. రమేష్ ప్రతిభ నలుదిశలా తెలియాలని ఆకాంక్షించారు. డీటీఎస్ రమేష్ మాట్లాడుతూ నోటి ద్వారా సంగీత ధ్వని అనుకరణతో జరిగే ఈ ప్రక్రియకు పలు ప్రదర్శనల్లో విశేష ఆదరణ దక్కిందన్నారు. కార్యక్రమంలో విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత విజయ్‌కుమార్, చెన్నా తిరుమలరావు, బాదంగీర్ సాయి, రిటైర్డ్ పోలీస్ అధికారి మహమ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

ఇంటిపై కూలిన చెట్టు తొలగింపు


గ్రీన్ గార్డెన్స్‌లో తొలగించిన చెట్టు

సాక్షి ఎఫెక్ట్..

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు గ్రీన్ గార్డెన్స్‌లోని ఓ ఇంటిపై బుధవారం రాత్రి నుంచి కురిసిన వర్షం కారణంగా రోడ్డు పక్కనే ఉన్న చెట్టు ఒరిగిపోయిన సంగతి తెలిసిందే. ఈ విషయమై గురువారం రాత్రి వరకు జీవీఎంసీ అధికారులు పట్టించుకోక పోవడంతో స్థానికులు మండిపడ్డారు. ఈ సమస్యపై 'తెరిపివ్వని వర్షంతో ఇక్కట్లు' అనే శీర్షికన 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన జీవీఎంసీ అధికారులు, సిబ్బంది శుక్రవారం ఆ చెట్టును తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

22ఏ నుంచి ఉపశమనం కల్పించాలి

మురళీనగర్: మురళీనగర్, మాధవధార జంట ప్రాంతాల్లోని స్థలాలను 22ఏలో చేర్చడం వల్ల దశాబ్దాలుగా రిజిస్ట్రేషన్లు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ససపల వరప్రసాద్ తెలిపారు. వీటికి 22ఏ నుంచి మోక్షం కలిగించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం

విశాఖ సిటీ : అకాల మరణం చెందిన హోంగార్డ్ మహ్మద్ హసమ్ కుటుంబానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. నగర పోలీస్ శాఖలో హసమ్ గత 19 ఏళ్లుగా విధులు నిర్వర్తిన్నారు. న్యూరో సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ ఈ నెల 15వ తేదీన మరణించారు. అతని కుటుంబానికి హోంగార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.10 వేలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.10 వేలు మంజూరు చేశారు. హోంగార్డ్ భార్య జరీనా కౌశర్‌కు శుక్రవారం రూ.20 వేల చెక్కును అందజేశారు.

శిక్షణ పూర్తయింది.. రిలీవ్ చేయండి

- ఏఎస్ఎంల డిమాండ్


ధర్నా చేస్తున్న ఏఎస్ఎంలు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో రెండేళ్ల శిక్షణ పూర్తి చేసుకున్న తమను రిలీవ్ చేసి.. పని చేసే ప్రాంతాలకు తిరిగి పంపాలని ఏఎస్ఎంలు డిమాండ్ చేశారు. రేసవానిపాలెం వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ఎదుట శుక్రవారం ఏఎస్ఎంలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు ఏఎస్ఎంలు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో రెండేళ్ల పాటు శిక్షణ పూర్తి చేశామని చెప్పారు. రెండేళ్ల కాలంలో మొదటి సంవత్సరం, రెండో సంవత్సరంగా విభజించి పరీక్షలు పూర్తి చేసి సర్టిఫికెట్లు ఇచ్చారని, ఇంకా తమను ఇక్కడ కొనసాగించడం అన్యాయమన్నారు. మార్చి నుంచి శిక్షణ పేరిట నెలనెలా పొడిగిస్తున్నారని.. ఇంకా పొడిగిస్తారో, రిలీవ్‌చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణాలు చేయలేక, ఉద్యోగం వదులు కోలేక, కుటుంబ సభ్యులకు దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రిలీవ్ చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీకి సమర్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- జీవీఎంసీ జోన్-5 కమిషనర్ కృష్ణ
- వార్డుల్లో 'ఫ్రైడే – డ్రైడే'


ఫ్రైడే - డ్రై డే కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ ఆర్జీవీ కృష్ణ, చిత్రంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు


అవగాహన కల్పిస్తున్న రెయ్యి వెంకటరమణ


44వ వార్డులో దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు


వినాయకనగర్‌లో నీటి నిల్వలు పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ కార్యదర్శులు

తాటిచెట్లపాలెం: వాతావరణ మార్పుల కారణంగా ప్రబలే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్-5, జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ తెలిపారు. 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ వద్ద నిర్వహించిన ఫ్రై డే – డ్రై డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, శానిటరీ సూపర్‌వైజర్ జనార్దన్, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మలేరియా సిబ్బంది, హెల్త్ సెక్రటరీలు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

51వ వార్డులో..

మర్రిపాలెం: సీజనల్ వ్యాధులు, జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. వార్డులోని మహత్ కాలనీలో నిర్వహించిన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వారానికోసారి అందరూ తప్పక డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీవో ఉదయ్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హేమసుందర్, మలేరియా విభాగం నుంచి సునీత, సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

నిల్వ నీటితో ముప్పు

సీతంపేట: వారానికి ఒక రోజు డ్రై డే పాటించడం ద్వారా దోమలను నియంత్రించవచ్చని 44వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.సూరిబాబు అన్నారు. వార్డు పరిధిలో ముస్లిం తాటిచెట్లపాలెంలో శుక్రవారం ఫ్రై డే డ్రై డేపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో మంచినీరు, వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. తాగిపారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు, బాటిల్స్, పాడైన టైర్స్ ఇంటి పరిసరాలలో లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. నీటిని నిల్వ చేసే డ్రమ్ములు, గోళాలు, కుండీలు, సంపులలోకి దోమలు చొరబడకుండా మూతలు పెట్టాలన్నారు. ఫ్రిజ్ వెనుక ట్రిప్ బాక్సు, ఫ్లవర్ వేజ్‌లు, మనీ ప్లాంట్లు, కూలర్స్ నాలుగు రోజులకు ఒకసారి శుభ్రం చెయ్యాలని సూచించారు. లేదంటే దోమలు గుడ్లు పెట్టడం వల్ల వాటి సంతతి వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, చికున్‌గన్యా జ్వరాలను వ్యాప్తి చేస్తాయన్నారు. కార్యక్రమంలో సీవో నూకరత్నం, శానిటేషన్ సెక్రటరీ కిరణ్, సూపర్‌వైజర్ రాంబాబు, భాగ్యలక్ష్మి, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 24వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.సన్యాసినాయుడు సూచించారు. వార్డులోని వినాయకనగర్‌లో నిర్వహించిన ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో స్థానికులకు సీజనల్ వ్యాధులు, నీటి నిల్వలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు ప్రబలకుండా అందరూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. దోమల బారిన పడకుండా ఇంట్లోని పాత్రలు, డ్రమ్, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్ఎం భద్రతా తనిఖీలు

అరకు–కొత్తవలస సెక్షన్ పరిధిలో పనుల పరిశీలన


అరకు-కొత్తవలస సెక్షన్ పరిధిలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ కేకే లైన్ కొత్తవలస – అరకు మధ్య శుక్రవారం భద్రతా తనిఖీలు నిర్వహించారు. ఈ మార్గంలో జరుగుతున్న ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ పనులు, ట్రాక్ సర్క్యూట్స్, టన్నెల్స్, పాయింట్స్, క్రాసింగ్స్, బ్రిడ్జిల నిర్వహణ, ట్రాక్షన్ సబ్‌స్టేషన్లు, వసతులు, భద్రతా ప్రమాణాలు, రక్షణ గోడల వంటి పలు ఆధునికీకరణ, అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాకాలంలో బండరాళ్లు ట్రాక్‌లపై పడే అవకాశమున్న ప్రాంతాలను నిశితంగా పరిశీలించి, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం స్టేషన్ మాస్టర్, సిబ్బందితో మాట్లాడారు. టన్నెల్స్, ఘాట్ సెక్షన్‌లలో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్, సమాచార వ్యవస్థలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలిపారు. రైళ్ల రాకపోకలు సాఫీగా సాగిపోయేందుకు పాటించవలసిన అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని, విధి నిర్వహణలో ఏ మాత్రం ఆదమరచి ఉండరాదని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలలో ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, వివిధ విభాగాలకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నూతన మోటారు చట్టం రద్దు చేయాలి

ఆటో డ్రైవర్ల డిమాండ్



నిరసన చేపడుతున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: రోడ్డు రవాణా రంగంపై ఆర్థిక భారాలు వేసే జీవోలు వెంటనే రద్దు చేయాలని ఏపీ ఆటో వర్కర్స్ అండ్ డ్రైవర్స్ అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. సెప్టెంబరు 3న విశాఖలో జరగనున్న ప్రదర్శన, బహిరంగ సభలో పెద్ద సంఖ్యలో డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ అక్కయ్యపాలెం హైవే వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేసిన 2023 నూతన మోటారు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వందరోజుల్లో నిత్యావసర సరకులు, ఇంధన ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. నూతన మోటారు చట్టం రవాణా రంగాన్ని దివాలా తీస్తుందని, ఇప్పటికైన కేంద్రం కళ్లు తెరిచి ప్రమాదకర చట్టాలను రద్దు చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో రావికృష్ణ, ఎం.నాగరాజు, జి.కనకరాజు, కె. అప్పలరాజు, ఎస్.కామేశ్వరరావు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 118 మంది ఎంపిక

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. సుమారు 08 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 668 ఖాళీల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 283 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 118 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు చెప్పారు. ఎంపికైన వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఎంపికైన అభ్యర్థులు సెప్టెంబర్ 2న సోమవారం ఆయా కంపెనీలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ ఉపాధి అధికారి సిహెచ్.కుమారస్వామి, ఎం.కె.మనోరమ, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.